నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 14 మార్చి 2025 HYDERABAD








సున్నం చెరువు వద్ద బారులు తీరిన నీటి ట్యాంకులు

# సిటీకి మంచినీళ్లు ఎట్లా?

## సాగర్‌లో మార్చిలోనే ఎమర్జెన్సీ! • మేఘాతో అందుబాటులోకి రాని సుంకిశాల


### చంద్రబాబు సర్కారు జల చౌర్యానికి.. మేఘా కంపెనీని కాపాడాలనే రేవంత్ సర్కారు పన్నాగం...

వెరసి నాగార్జునసాగర్‌కు పుష్కలమైన ఇన్‌ఫ్లో ఉన్నప్పటికీ ఒకవైపు ఎడమ కాల్వ చివరి ఆయకట్టు రైతులు సాగునీటి కోసం అల్లాడుతుండగా... మరోవైపు మార్చి రెండో వారంలోనే 'ఎమర్జెన్సీ' ఘంటికలు మోగడం ప్రాజెక్టు చరిత్రలో ఇదే తొలిసారి. ఎండా కాలం ఆరంభంలోనే ఇలాంటి సంక్షోభ పరిస్థితి నెలకొనడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనూ చోటు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో జలమండలి మార్చిలోనే ఎమర్జెన్సీ మోటార్ల ఏర్పాటును మొదలుపెట్టడం హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ముప్పు పొంచి ఉన్నదనేది స్పష్టమవుతున్నది. మేఘా కంపెనీ నిర్వాకంతో సుంకిశాల పథకం అందుబాటులోకి రాకపోవడంతోనే ఎమర్జెన్సీ మోటార్లపై ఆధారపడాల్సి వస్తున్నది. రూ.4.68 కోట్లతో పుట్టంగండి వద్ద ఎమర్జెన్సీ మోటార్లను అమర్చే పనులకు గురువారం టెండరు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయం ఖాళీ అవుతున్న తీరును పరిశీలిస్తే రానున్న ఒకట్రెండు నెలల్లో ఓ వైపు సాగునీరు... మరోవైపు హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం తాగునీటి పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతున్నది. -సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 13 (నమస్తే తెలంగాణ)

- అత్యవసర మోటార్ల ఏర్పాటుకు జలమండలి టెండర్లు
- రూ.4.68 కోట్ల అంచనా వ్యయంతో నోటిఫికేషన్ జారీ
- రోజూ సాగర్ నుంచి సరాసరిన ఒకటిన్నర టీఎంసీల విడుదల
- మార్చి ముగిసేలోగా 506 అడుగులకు చేరుకోనున్న నీటిమట్టం
- ఎడమ కాల్వ డిశ్చార్జి పెంచాలంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- కేఆర్‌బీఎం అనుమతిస్తే మార్చిలోనే 500 అడుగులకు సాగర్
- పుష్కలమైన ఇన్‌ఫ్లోలున్నా చరిత్రలోనే తొలిసారిగా ఎమర్జెన్సీ పరిస్థితులు

### గతేడాది భారీ వరదలు..

నాగార్జునసాగర్ జలాశయానికి గతేడాది భారీ వరదలు వచ్చాయి. నవంబర్ చివరి నాటి వరకు ఇన్‌ఫ్లోలు రావడంతో పాటు ప్రాజెక్టులన్నీ నిండి సముద్రంలోకి 850 టీఎంసీల కృష్ణా జలాలు కలిశాయి. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు చరిత్రలో తెలుగు రాష్ట్రాల్లోని ఆయకట్టుతో పాటు హైదరాబాద్ తాగునీటికి సైతం ఢోకా ఉండేది కాదు. చివరకు తదుపరి సంవత్సరంలో వర్షాలు ఆలస్యమైనా సరే... సెప్టెంబర్ వరకు తాగునీటికి ఇబ్బంది లేదని చరిత్రనే చెబుతున్నది. కానీ పుష్కలమైన ఇన్‌ఫ్లోలు ఉన్నా తాగు, సాగునీటికి మార్చిలోనే ఇబ్బందులు మొదలవ్వడం అనేది సాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారి అని అధికారులే చెబుతున్నారు. ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం సాగర్‌కు ఇన్‌ఫ్లోలు నిలిచిపోయిన తర్వాత కూడా భారీ ఎత్తున కృష్ణా జలాలను తరలించుకుపోయింది. కేవలం సాగర్ కుడి కాల్వ ద్వారా 200 టీఎంసీలను తరలించుకుపోయారంటే దాని వెనక ఆంతర్యమేమిటో ఎవరికీ అంతుబట్టడం లేదు.



### బాబు జలదోపిడీకి రేవంత్ తందాన!

అసలు కుడి కాల్వ కింద రెండు సీజన్లలో కలిపినా 200 టీఎంసీల మేర సాగునీటి వినియోగించేంత ఆయకట్టు లేదు... నిల్వ సామర్థ్యం కూడా లేదు. చంద్రబాబు సర్కారు ఇష్టానుసారంగా కోటాకు మించి నీటిని తరలిస్తున్నా.. రేవంత్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడంపైనా అనేక అనుమానాలున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్మాణ సంస్థ మేఘా ఇన్‌ఫ్రా నిర్వాకంతో మునిగిన సుంకిశాల పంపుహౌస్‌లో ఎండా కాలంలోనే పనులు జరగాలంటే సాగర్ ఖాళీ కావాల్సిన అవసరమున్నది. రేవంత్ ప్రభుత్వం లక్షలాది మంది రైతులు, హైదరాబాద్ తాగునీటి ప్రయోజనాలను పణంగా పెట్టి చంద్రబాబు జల చౌర్యానికి సహకరించిందనే ఆరోపణలున్నాయి. ఫలితంగా మార్చి రెండో వారంలోనే జలమండలి సాగర్‌లో ఎమర్జెన్సీ మోటార్ల ఏర్పాటుకు కసరత్తు మొదలుపెట్టాల్సి వచ్చింది.

### రెండు నెలల ముందే గడ్డు పరిస్థితి...

సాగర్‌కు ఇన్‌ఫ్లోలు లేని సంవత్సరంలోనూ నాగార్జునసాగర్‌లో 510 అడుగుల నీటిమట్టాన్ని నిర్వహించడం వల్ల మే నెలాఖరు వరకు అంతకంటే నీటిమట్టం తగ్గితే జలమండలి అత్యవసర మోటార్లను ఏర్పాటు చేసుకుంటుంది. ఏప్రిల్ చివర్లోగానీ ఆ ప్రక్రియపై దృష్టిసారించదు. కానీ ఇప్పుడు మార్చి రెండో వారంలోనే టెండర్లు పిలవడంపై ఇంజినీర్లే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### నీటి గండం

- 8 రోజులుగా సాగర్‌లో నీటిమట్టం పడిపోవడాన్ని పరిశీలిస్తే రోజుకు సుమారు ఒకటిన్నర టీఎంసీల వరకు ఖాళీ అవుతుంది.
- ప్రస్తుతం 151 టీఎంసీలు ఉన్నాయంటే ఈ లెక్కన మార్చి ముగిసేనాటికి సుమారు 25 టీఎంసీలు తగ్గి నీటిమట్టం 506.90 అడుగులకు పడిపోతుంది.
- ఏపీ ప్రభుత్వం ఎడమ కాల్వ కింద తమకు డిశ్చార్జిని పెంచమని ఇప్పటికే కేఆర్ఎంబీకి లేఖ రాసింది. రోజుకు 3,530 క్యూసెక్కులు కావాలని డిమాండు చేస్తుంది. మార్చి చివరినాటికి ఏపీకి ఎడమ కాల్వ కిందనే 16 టీఎంసీల వరకు ఇవ్వాల్సి ఉంది.
- ఏప్రిల్ రెండో వారానికి సాగర్‌లో నీటిమట్టం 500 అడుగుల కంటే కిందకు పడిపోయే అవకాశముంది.
- మాధవరెడ్డి ప్రాజెక్టులో 4 మోటార్లు ఉన్నాయి. వీటి ద్వారా సెకనుకు 600 క్యూసెక్కుల చొప్పున 2400 క్యూసెక్కుల జలాలు విడుదలవుతాయి.
- ప్రస్తుతం సాగర్‌లో 521 అడుగులు ఉన్నందున మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్ల డిశ్చార్జి 450 క్యూసెక్కులకు పడిపోయింది. అంటే ఎండా కాలం ప్రారంభంలోనే ప్రాజెక్టు నుంచి 600 క్యూసెక్కుల డిశ్చార్జి తగ్గిపోయింది.
- సాగర్‌లో 510 అడుగుల కంటే నీటిమట్టం తగ్గిపోతే మాధవరెడ్డి ప్రాజెక్టులో మోటార్ల నుంచి నీటి ఎత్తిపోతలు నిలిచిపోతుంది.
- అత్యవసర మోటార్ల ద్వారా ప్రాజెక్టు అప్రోచ్ చానెల్‌లో నీటిని ఎత్తిపోసి, మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్లు నడిచేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- జలమండలి ఎమర్జెన్సీ మోటార్ల సామర్థ్యం చాలా తక్కువగా ఉంటుంది. అందుకే అవి కాల్వలోకి ఎత్తిపోసే నీళ్లతో మాధవరెడ్డి ప్రాజెక్టులో ఒకటీ, రెండు మోటార్లు నడవటమే కష్టంగా ఉంటుంది.
- అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కేవలం తాగునీరే కాకుండా ప్రాజెక్టును నమ్ముకొని దాదాపు 2.68 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటికి వీటికి కూడా నీటిని అందించాలి.
- జలమండలి అత్యవసర మోటార్లపై హైదరాబాద్ తాగునీటి వ్యవస్థ నెలన్నరకు పైగా ఆధారపడాల్సి ఉంటుందనే అంచనా వేస్తున్నారు. ఎన్నడూ ఇంత సుదీర్ఘకాలం ఆధారపడిన సందర్భం లేనందున ముందు మే నెలలో తాగునీటి సరఫరా తీరు ఎలా ఉంటుందనేది ఆందోళన కలిగించే పరిణామమే.

### సుంకిశాలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

సాగర్‌లో డెడ్ స్టోరేజీ ఉన్నా హైదరాబాద్ తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం సుంకిశాల పథకాన్ని చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి 80 శాతానికి పైగా పనులు పూర్తయినా సర్కారు పర్యవేక్షణలోపంతో వేగంగా పనులు జరగలేదు. ఈలోగా జలమండలి ఇంజినీర్ల ఘోర వైఫల్యంతో మేఘా ఇంజినీరింగ్ కంపెనీ ఇష్టానుసారంగా వ్యవహరించి తప్పుడు అంచనాలతో సొరంగాన్ని తెరిచి పంపుహౌస్‌లోని రిటెయినింగ్‌వాల్, గేట్లను కుప్పకూల్చింది. దీంతో ఐదు నెలలుగా సుంకిశాల పనులు నిలిచిపోయాయి. వాస్తవానికి ఇప్పటికే పనులు పూర్తయితే ఇలాంటి అత్యవసర సమయంలో కోట్లాది రూపాయల ప్రజాధనం ఆదా అయ్యేది. సుంకిశాల నిర్వాకం మూలాన జలమండలి ఇప్పుడు రూ.4.68 కోట్లతో ఎమర్జెన్సీ మోటార్లను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తున్నది.



సాగర్‌లో 510 అడుగుల నీటి మట్టం నిర్వహించాలని జలమండలి ఇరిగేషన్ శాఖకు లేఖ రాసింది. కానీ సాగునీటి అవసరాల దృష్ట్యా ఇది సాధ్యం కాదని అధికారులే చెబుతున్నారు.

అడుగంటిన నాగార్జున సాగర్



అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో నాలుగు రోజులుగా నీళ్లు రాకపోవడంతో గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు



నీటమునిగిన సుంకిశాల పంప్ హౌస్





# బిల్డ్ నౌ ఎప్పుడో..?

- సాంకేతిక సమస్యలతో సతమతం
- నిర్మాణదారుల్లో ఆందోళన
- అధికారుల తీరుపై విమర్శలు
- ఈ నెల 10 నుంచే అందుబాటులోకి తెస్తామన్న కమిషనర్

సిటీబ్యూరో: నిర్మాణ రంగ అనుమతులు మరింత సులభతరం చేస్తూ 'బిల్డ్ నౌ' విధానాన్ని అమలు చేయబోతున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన బల్దియా.. ఆచరణలో అపసోపాలు పడుతున్నది. ప్రస్తుతం అమలవుతున్న టీజీబీపాస్ మించి తక్కువ సమయంలో ఇంటి నిర్మాణ అనుమతులు పొందవచ్చని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ టెక్నాలజీ రూపొందించిన బిల్డ్ నౌతో అనుమతుల జారీలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు హడావుడి చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బిల్డ్ నౌ అప్‌లోడ్ చేసే విధానంపై ఆర్కిటెక్ట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంతే కాకుండా ఈ నూతన విధానంపై జోనల్, డిప్యూటీ కమిషనర్లకు అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 10 నుంచి బిల్డ్ నౌ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని స్వయంగా కమిషనర్ ఇలంబర్తి ప్రకటించారు. 14వ తేదీ వచ్చినా.. బిల్డ్ నౌ పై మౌనంగా ఉన్నారు. ప్రారంభ సమయంలో భాగంగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, గడిచిన రెండు రోజులుగా సదరు సాఫ్ట్‌వేర్ నిపుణులు తర్జన భర్జన పడుతున్నట్లు తెలిసింది. బిల్డ్ నౌ విధాన అమలులో మరింత ఆలస్యం కానుందని టౌన్‌ప్లానింగ్ వర్గాలు తెలిపాయి. మొత్తంగా ఆదిలోనే ఆధునిక విధానం అపసోపాలు పడుతుండడంపై నిర్మాణదారుల్లో ఆందోళన నెలకొంది.

### 15 రోజుల్లోనే అనుమతి..


బిల్డ్ నౌ విధానం అమల్లోకి వస్తే ఇంటి అనుమతి 15 రోజుల్లోపే లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు సమయంలో ఉన్న లోపాలను గుర్తిస్తుందని, ప్లాన్ మొదటి నుంచి పరిశీలించాల్సిన అవసరం ఉండదని, గుర్తించిన అంశాన్నే సవరించి అప్‌లోడ్ చేసే వెసులుబాటు ఉందన్నారు.

### 75 గజాల లోపు ఉంటే..

ఇంటి స్థలం విస్తీర్ణం 75 గజాల లోపు ఉంటే దరఖాస్తు చేసుకోగానే అనుమతి వచ్చేస్తుందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌లు రూపొందించే డ్రాయింగే ప్రామాణికం. ప్రస్తుత వ్యవస్థలో డ్రాయింగ్ పరిశీలనకు కొన్ని వారాల సమయం పడుతోందని.. ఇది కాస్తా నిమిషాల్లో తగ్గనుందని చెప్పిన అధికారులు..ఆచరణలో మాత్రం తమ చిత్తశుద్ధిని ప్రదర్శించ కలేకపోతున్నారు.

# మీకు సెలవుల్లేవ్..

## ఇంటి పన్నులు వసూలు చేయాల్సిందే





సిటీబ్యూరో: ఆస్తిపన్ను నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు జీహెచ్ఎంసీ ఆపసోపాలు పడుతున్నది. మరో 17 రోజుల్లో ఆర్థిక సంవత్సరం గడువు ముగియనున్నది. 12.70 లక్షల మంది నుంచి రూ. 1,570 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. మరో రూ.430 కోట్ల వసూళ్లు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ట్యాక్స్ కలెక్షన్స్‌కు సంబంధించిన అధికారులు, సిబ్బందికి సెలవులను రద్దు చేశారు.

### వన్‌పాయింట్ ప్రోగ్రాం..

హోలీ, రంజాన్, ఉగాది పండుగలు తదితర అన్నిలర కాల సెలవులు రద్దు చేసుకుని ఆస్తిపన్ను వసూళ్లపై ఫోకస్ పెట్టేలా దిశానిర్దేశం చేశారు. ఈ నెలాఖరు వరకు ఇతర పనుల జోలికి వెళ్లకుండా ఆస్తిపన్ను వసూళ్లపై వన్ పాయింట్ ప్రోగ్రాం కింద తీసుకుని పనిచేయాలని ఆదేశించారు. అంతకు ముందు జోన్ల వారీగా ఐదు లక్షలు బకాయిదారుల జాబితాను రూపొందించి వారిపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. అయితేఆశించిన స్థాయిలో వసూళ్లు రాకపోవడంతో ఈ నెల 7న ఆస్తి పన్ను బకాయిదారులకు ఓటీఎస్ (వన్ టైం సెటిల్ మెంట్) స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓటీఎస్ ద్వారా రోజుకు ఆస్తిపన్నులో వేగం పెరుగుతుందని భావించారు. కానీ ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకునేందుకు పెద్దగా బకాయిదారులు ముందుకు రావడం లేదు. ఈ మేరకు ఓటీఎస్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, కనీసం రూ. 300కోట్లు ఓటీఎస్ వసూళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీసీలకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బకాయిలపై దృష్టి సారించి సంబంధిత శాఖలను నోటీసులు ఇవ్వనున్నారు. మొత్తంగా ప్రజా సమస్యలను పక్కన పెట్టి ఆస్తిపన్ను కలెక్షన్లు టార్గెట్‌గా అధికారులు పనిచేయనున్నారు.

• హ్యాపీ బర్త్‌డే..





ఒడిశాలోని పూరీలో గురువారం శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాకారులు రూపొందించిన ఎమ్మెల్సీ కవిత సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకున్నది.



నందనవనం పార్కును ప్రభుత్వం కాపాడాలంటూ నినాదాలు చేస్తున్న ఆనంద్‌నగర్‌కాలనీవాసులు

# ప్రాణాలను పణంగాపెట్టి.. పార్కును కాపాడుకుంటాం

జవహర్‌నగర్, మార్చి 13: జవహర్‌నగర్‌లోని నందనవనం పార్కును కబ్జా చేయాలని చూడటం దుర్మార్గమని, కబ్జాదారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆనంద్‌నగర్ కాలనీవాసులు అన్నారు. రూ. 35లక్షలతో పార్కును సుందరంగా బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్చిదిద్దితే కాంగ్రెస్ ఖతం చేయాలని చూస్తున్నదని ఆరోపించారు. ప్రాణాలను పణంగా పెట్టైనా.. కబ్జా కాకుండా పార్కును కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో పుష్పలత, ఐలమ్మ, లత, జయ, రత్నా తదితరులు పాల్గొన్నారు.



హోలీ సంబురం ▶ బేగంబజార్‌లో హోలీ సందర్భంగా మహిళల సందడి